

# మసాలా...

నిర్వహణ:

బ్రహ్మానందం గొర్తి

## చమత్కారం

సందర్భానుసారంగా మాట్లాడడం అనేది ఒక ప్రత్యేకమైన కళ. దానికి కాస్త హాస్యం జత చేస్తే ఆ పలుకులు మరింత జనరంజకం అవుతాయి. శ్రీ కృష్ణమాచారి అనే మాకు తెలిసిన ఒకాయన విశాఖపట్నంలో ఉండే వారు. విశాఖపట్నానికి వాల్తేరు, వైజాగ్ అనే మారుపేర్లు కూడా ఉన్నాయన్న సంగతి అందరికీ విదితమే !ఒకసారి కృష్ణమాచారిగారు గోదావరి ఎక్స్ ప్రెస్ లో హైద్రాబాదు నుండి వైజాగ్ వచ్చారు. ట్రైన్ దాదాపు గంటన్నర ఆలస్యంగా వచ్చింది.

ఆయన్ని రిసీవ్ చేసుకోడానికి వచ్చిన ఒకాయన, "ట్రైన్ గంట ఆలస్యంగా వచ్చిందే ?" అని అడిగాడు.

" ఏముందీ - హైద్రాబాదులో 'వై' స్లో 'జాగ్' అంటూ టైముకే బయల్దేరింది. తీరా వైజాగ్ దగ్గరికొచ్చాక 'వై జాగ్' గో స్లో అని నెమ్మదిగా వచ్చింది. అందుకే ఈ ఆలస్యం.అయిన ఆలస్యం ఎలాగూ అయ్యింది - 'వై' స్లో 'జాగ్' హోం !" అన్న ఆయన సమాధానం చూసి ఆ వచ్చినాయన ఆశ్చర్యపోయాడు.

సమయస్ఫూర్తితో మాట్లాడడం అందరికీ రాదు.

## ఒక్కటే !



పెళ్ళి, జీవిత భీమా ( Life Insureance ) రెండూ ఒక్కటే. ఒక్కసారి కమిట్ అయితే జీవితాంతం మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

మధ్యలో ఆపేస్తే మొదట్లో పెట్టిన పెట్టుబడితో సహా అంతా కోల్పోవలసి వస్తుంది.

## సొగసరి మొగుడు - గడసరి పెళ్ళాం

"రాజ్యం నే పోయాక బెంగతోబాధపడకు! వేరేఇంకెవర్నయినా పెళ్ళిచేసుకోని ఆనందంగా ఉండు." అనారోగ్యపు భర్త ఆఖరి మాటగా అన్నాడు.

" అదేమిటి అలా అంటారు ? మీరే నా దైవం ! " వాపోయింది భార్య.

" అలా అనకు రాజ్యం ! నే పోయాక నా కారు, డబ్బు, ఇల్లు, బట్టలు అన్నీ ఇంకో అతనికి ఇచ్చి, పెళ్ళి చేసుకొని , అతనిలో నన్ను చూసుకో ! అంతేకాని - ఒంటరిగా జీవితం గడపకు !" ప్రాధేయపడ్డాడు అమాయకపు భర్త.

" అలాగే - మీరంతగా చెబుతున్నారుకనక మీ కారు, డబ్బు, ఇల్లు అన్నీ అతనికి ఇస్తా, ఒక్క మీ బట్టలు తప్ప - ఎందుకంటే అవి అతనికి సరిపోవు ! " తాపీగా చెప్పింది భార్య.

## దారితప్పిన చట్టం



చట్టానికి కళ్ళు లేవు - సాయంలేకపోతే అది దారి తప్పుతుంది

సాధారణంగా - ఎక్కడైనా, ఎవరైనా హత్యాప్రయత్నం చేస్తే జైలు కెళతారు

కాని ఆంధ్రాలో మాత్రం "ఆసుపత్రి" కెళతారు - కేర్ కోసం !

## వెరైటీ

ఓ సినీ నటుడు ఎన్నో కోట్లు వ్యయం చేసి ఓ భారీ సినిమా తీసాడు. సినిమా రిలీజు ముందు మీడియా వాళ్ళకోసం చాలా ఖర్చుపెట్టి ఓ ప్రత్యేక ఫంక్షన్ ఏర్పాటు చేసాడు. ఆ కార్యక్రమంలో ఆ నటుడు ప్రసంగిస్తూ -



" ఈ సినిమా చాలా వెరైటీ పిక్చర్ ! కథ, కథనం అంతా డిఫరెంట్ ! నేనింతవరకూ చేసిన పాత్రలు ఒక ఎత్తు, ఈ సినిమాలో పాత్ర ఒక ఎత్తు ! ఓవరాల్ గా ఈ పిక్చరే డిఫరెంట్ ! ...." అంటూ భారీగా ప్రసంగం చేసాడు.

ఓ సినీ విలేఖరి ఇదే విషయాన్ని తెగ రాసేడు, ఈ పిక్చర్ భారతదేశ సినీ చరిత్రలోనే ఒక మకుటమణిహారంగా ఉంటుందని. తీరా పిక్చర్ రిలీజు అయ్యాక అది కాస్తా బాక్సాఫీసు దగ్గరకూలబడింది. పాపం ఆ సినీ విలేఖరి ఆ సినిమారివ్యూ ఈ విధంగా రాసాడు.

" ఈ సినిమాలో కథ, కథనం అంతా డిఫరెంట్ ! హీరో పాత్ర కూడా మరీ డిఫరెంట్ ! సంగీతం డిఫరెంట్ ! డైరెక్షన్ డిఫరెంట్ ! మొత్తానికి ఈ పిక్చరే డిఫరెంట్ ! అందుకే ప్రేక్షల తీర్పు కూడా చాలా డిఫరెంట్ ..."

## శతకోటి దరిద్రాలకి ......

ఓ రాజకీయ నాయకుడు ఎలక్షన్ లో నెగ్గి అధికారంలోకి వస్తే, రాష్ట్రమంతా "ఉచిత విద్యుత్" పథకంలో రోజుకి ఏడు గంటలు ఉచితంగా విద్యుచ్ఛక్తి ఇస్తానని ప్రకటించాడు.

ఇది సాధ్యంకాదని తెలిసిన ఇంకో వ్యక్తి - "ఇలాంటి వాగ్దానాలు చేస్తే - అమలుచేయడం కష్టం కదా ? రాష్ట్రానికి ఆర్థికంగా నష్టం కదా ?" అనిసందేహం వెలిబుచ్చాడు.

దానికి ఆ నాయకుడు - " రోజూ మధ్యాహ్నం రెండు గంటల నుండి రాత్రి తొమ్మిదివరకూ ఉచితంగా విద్యుత్ అన్నాం కాని - కరంటు ఇస్తామని హామీ ఇవ్వలేదు కదా ! ఏముంది ఆ ఏడు గంటలూ కరెంటు తీసేసి - కావాలంటే పక్కరాష్ట్రం నుండి కొనుక్కోమటే సరి !" అని తాపీగా చెప్పాడు. ఈ సమాధానానికి అదిరిపడ్డాడు ప్రశ్న అడిగిన వ్యక్తి.

శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు మరి !

## సామెతలు

సుగ్రీవుడికి లేక ఇంటికి సున్నం కొట్టుకుంటుంటే, వాలి వచ్చి పెయింట్ అప్పు అడిగాడుట !



## ఈ మాసపు మాట

చంపేదెవరు, చచ్చేదెవరు - అంతా మిధ్య ! గురితప్పని
"కృష్ణ సందేశం"



## వినదగు నెవ్వరు చెప్పిన.....

తప్పుడు పనులు చేయకుండా సిజాయితీగా బ్రతకడానికి ధైర్యం చాలా అవసరం !
చేసిన తప్పుడు పనులు సిజాయితీగా ఒప్పుకోవడానికి పదిరెట్ల ధైర్యం కావాలి !!